సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం : 16 : మే : 2023



డెంగీ జ్వరంతో ప్రమాదం

డెంగీ జ్వరం వైరస్‌తో సంక్రమించే ప్రమాదకరమైన వ్యాధి అని, దోమలు కుట్టడంతో ఇది వ్యాప్తి చెందుతుందని వైద్యులు అంటున్నారు. 8లో



తిరోగమనం దిశగా బీజేపీ

దేశవ్యాప్తంగా బీజేపీ తిరోగమనం ప్రారంభమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
43° / 27°

వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం చూపుతూ మధ్యాహ్నానికి భారీగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అమెరికాలో రామాలయ నిర్మాణం

- స్వామివారి విగ్రహాలకు భద్రాద్రిలో పూజలు



విగ్రహాలకు ధాన్యాధివాసం చేస్తున్న అర్చకులు, ఆలయ ఈఓ రమాదేవి

భద్రాచలం: అమెరికాలోని అట్లాంటాలో నిర్మిస్తున్న రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు సోమవారం భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అట్లాంటా ఎన్‌ఆర్‌ఐల ఆధ్వర్యంలో భద్రాచలం రామాలయ నమూనా తరహాలో ఉండేలా ఆలయం నిర్మిస్తున్నారు. ఇందులో ప్రతిష్ఠించేందుకు ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాలలో శ్రీ సీతారామలక్ష్మణులు, ఆంజనేయుడు, గరుత్మంతుడి విగ్రహాలను తయారు చేశారు. సోమవారం వీటిని ఏపీ దేవాదాయ శాఖ రిటైర్డ్ స్తపతి రాజేశ్వరాచార్యులు ఆధ్వర్యంలో భద్రాచలం తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఈ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, ధాన్యాధివాసం చేశారు. 45 రోజుల పాటు ధాన్యాధివాస పూజల అనంతరం విగ్రహాలను అట్లాంటాకు తీసుకెళ్లనున్నారు. భద్రాద్రి రామాలయంలో జరిగే సంప్రదాయ పూజలనే అట్లాంటాలోనూ ఆచరించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరాచార్యులు తెలిపారు. ధాన్యాధివాస పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు పాల్గొన్నారు.

బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

అశ్వారావుపేటరూరల్: పోలీస్‌స్టేషన్లకు వివిధ సమస్యలపై వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. సోమవారం ఆయన అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసుల ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు న్యాయం చేసి పోలీస్‌శాఖపై నమ్మకం పెంచాలని అన్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, స్థానిక సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన పీఓ



కమిషన్ సభ్యుడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు రోజుల పర్యటనలో భాగంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్ సోమవారం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసిన వారు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మాయని మచ్చ !

- త్యాగాల చరిత్ర కార్మిక సంఘాల సొంతం
- ఆ చరిత్రకు చేటు చేస్తున్న కొందరు నాయకులు
- ఆధిపత్యం కోసం నేతల ఆరాటం
- అనవసర అంశాల్లో మితిమీరిన జోక్యం





సింగరేణి ప్రధాన కార్యాలయం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒకప్పుడు కార్మికుల కష్టాలను తమ భుజాలపై వేసుకుని యాజమాన్యంతో పోరాడిన కార్మిక సంఘాల నాయకులు సింగరేణిలో కోకొల్లలు. ఇప్పటికీ సంస్థలో ఆ పరంపర కొనసాగించే నాయకులు ఉన్నారు. అయితే కొందరు నేతల వ్యవహారశైలి, ప్రవర్తన ఇబ్బందికరంగా మారుతున్నాయి.

ఇదేనా ఆదర్శం..

సీపీఐ అనుబంధ కార్మిక సంఘమైన ఏఐటీయూసీలో చురుగ్గా పని చేస్తూ ఆ యూనియన్‌లో ట్రేడ్స్ మన్ ఇన్‌చార్జ్ స్థాయికి నాదెండ్ల శ్రీనివాసరెడ్డి ఎదిగారు. ఆ తర్వాత టీజీబీకేఎస్‌లో చేరి, ఆ సంఘ ముఖ్య నాయకుల్లో ఒకరుగా కొనసాగుతున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా కూడా నియమితులయ్యారు. కానీ, తన స్థాయికి తగ్గట్టుగా నడుచుకోకుండా కార్మిక సంఘాలకు మచ్చ తెచ్చారనే వాదన కార్మికుల్లో వ్యక్తమవుతోంది. తరచుగా విధులకు గైర్హాజరు కావడంపై మెమో ఇవ్వడంతో పాటు ప్రశ్నించిన తన పైఅధికారి శివప్రసాద్‌ను ఉద్దేశించి 'గతంలో రెండు హత్యలు చేశా, త్వరలో నీ అంతు చూస్తా' అంటూ శ్రీనివాసరెడ్డి మాట్లాడడాన్ని కార్మికులు సహించడం లేదు. నలుగురికి ఆదర్శంగా ఉండాల్సిన నేతలు ఇలా చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేసింది.

తన మాటే నెగ్గాలని మరొకరు..

సింగరేణిలో సెక్యూరిటీ విభాగంలో పని చేసే ఉద్యోగులు ఎస్‌అండ్‌పీసీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో 40 ఏళ్ల క్రితం సహకార సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో సుమారు 300 మంది వరకు సభ్యులు ఉండగా నిన్నా మొన్నటి వరకు రూ.7 కోట్లకు పైగా డిపాజిట్లు ఉండేవి. ఈ సంఘం పాలకవర్గానికి ఇటీవలి వరకు టీజీబీకేఎస్ నేత ముప్పాని సోమిరెడ్డి ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఆ సమయంలో పరపతి సంఘంలో ఆయన మాటకు తిరుగే లేకుండా పోయింది. అయితే 2022 ఆగస్టులో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ప్రెసిడెంట్ పోస్టు వదులుకోవాల్సి వచ్చింది. తనకు ఏ పదవి లేకపోయినా సరే కార్మిక సంఘం నేత అనే కార్డును అడ్డుపెట్టుకుని నాటి నుంచి నేటి వరకు సహకార సంఘంలో తన మాటే నెగ్గాలంటూ ఇతర సభ్యులపై వివిధ రూపాల్లో తీవ్ర ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన మాట కాదంటే అసలు పరపతి సంఘాన్నే నామరూపాలు లేకుండా చేస్తానంటూ సోమిరెడ్డి బాహాటంగానే వార్నింగ్‌లు ఇస్తున్నారు. ఈ మేరకు సొసైటీ బాధ్యులు ఇప్పటికే జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ)కి రాత పూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు.

అధికారమే అండగా..

తమ కార్మిక సంఘానికి నేతృత్వం వహిస్తున్న రాజకీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉందనే ధీమాతో కొందరు టీజీబీకేఎస్ నేతలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. సంబంధం లేని అంశాల్లో జోక్యం చేసుకోవడం, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, ప్రొటోకాల్ పాటించకుండా అధికారులను ఇబ్బందులకు గురిచేయడం కొందరు నాయకులకు పరిపాటిగా మారిందనే భావన కార్మికుల్లోనే వ్యక్తమవుతోంది. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ వంటి అంశాలను పక్కన పెట్టి తమ ఆధిపత్య ధోరణులకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ఇప్పుడు సింగరేణిలో చర్చనీయాంశమైంది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవడంలో సింగరేణి యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఎన్నికల ఏడాదిలో ఇలాంటి నేతల కార్మిక వ్యతిరేక చర్యలను బీఆర్‌ఎస్ పార్టీ ఏ విధంగా స్వీకరిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఘన చరిత్ర వారి సొంతం

నైజాం, బ్రిటీష్ జమానాలో సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికులతో వెట్టి చాకిరీ చేయించేవారు. పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా గనుల్లోకి దింపేవారు. కనీస రక్షణ చర్యలు లేని గనుల్లో ప్రాణాలు కోల్పోయిన వారు ఎందరో. దీనికి వ్యతిరేకంగా కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడుతూ కార్మిక నేత శేషగిరి ప్రాణాలను సైతం త్యాగం చేశారు. ఆ తర్వాత యూనియన్ కొమరయ్య నేతృత్వంలో సింగరేణి కార్మికులకు న్యాయమైన హక్కులను అప్పటి కార్మిక నాయకులు సాధించి పెట్టారు. మలిదశ తెలంగాణ ఉద్యమం కూడా కార్మికులను పోరుబాట పట్టించింది. ముఖ్యంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం మలిదశ ఉద్యమంలో సకల జనుల సమ్మె సమయంలో కీలక పాత్ర పోషించింది. ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత అటు టీఆర్‌ఎస్ అధికారంలోకి రాగా ఇటు సింగరేణిలో తిరుగులేని కార్మిక సంఘంగా టీజీబీకేఎస్ నిలిచింది. అయితే కొన్నేళ్లుగా టీజీబీకేఎస్‌లో కొందరు నాయకుల ప్రవర్తన, వ్యవహారశైలి ఇబ్బందికరంగా మారుతూ వస్తోంది.

వ్యవసాయ రంగానికి పెద్దపీట



బాలికల హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ తదితరులు

- సాగు విస్తరణతోనే దేశ ప్రగతి సాధ్యం
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయడంతోపాటు వ్యవసాయ విద్యా బోధన, సాగు విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో రూ.7.35 కోట్ల వ్యయంతో 55 గదులతో నిర్మించిన బాలికల వసతి భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని విద్యగా ఎంచుకోవడం దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావడమేనని అన్నారు. వ్యవసాయ విద్య అభ్యసించడమంటే దేశానికి సేవ చేయడమేనని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, రైతులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు. రైతులకు ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధరలు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని కన్న బిడ్డలా చూసుకుంటున్నారని చెప్పారు. అశ్వారావుపేట కళాశాలలో పీజీ సౌకర్యం లేదని, అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, డీఎస్‌ఏ జల్ల శ్రీనివాసరావు, కళాశాల డీన్ డాక్టర్ అహ్మద్ హుస్సేన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్, ఉద్యాన అధికారి మరియన్న, డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేనూ వ్యవసాయ పట్టభద్రుడినే..

దాదాపు 30 ఏళ్ల క్రితం నేను అగ్రికల్చర్ కోర్సును ఎంపిక చేసుకోగా, కొందరు స్నేహితులు వద్దని వారించారని, అయినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో 1989లో ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ విద్యను అభ్యసించి, గోల్డ్ మెడల్ సాధించానని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. ఆనాడే తాను వ్యవసాయంపై మక్కువతో ఈ రంగాన్ని ఎంచుకున్నానని, వ్యవసాయ పట్టభద్రుడైన తాను రాష్ట్ర మంత్రి హోదాలో స్థానిక వ్యవసాయ కళాశాలకు తొలిసారిగా రావడం, వసతి భవనాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తనలాగే విద్యార్థులు వ్యవసాయ విద్యను ఎంచుకోవడం అభినందనీయమని, ఈ విద్యను ఇష్టంతో పూర్తి చేస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించినట్లేనని, మంచి వ్యవసాయ అధికారులుగా అన్నదాతకు అమూల్యమైన సలహాలు, సూచనలు, సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

రేపు ఉమ్మడి జిల్లాలో గవర్నర్ పర్యటన

- భద్రాద్రిలో స్వామి దర్శనం, పూజలు
- గిరిజనుల వైద్య, ఆరోగ్య శిబిరానికి హాజరు
- ఖమ్మంలో చైతన్య కాలేజీ విద్యార్థులతో ముఖాముఖి



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

భద్రాచలం: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో పర్యటించనున్నారు. కేవలం ఏడాది వ్యవధిలోనే గవర్నర్ నాలుగోసారి భద్రాచలం పర్యటనకు వస్తుండడం విశేషం. గతంలో ఒకసారి రామాలయం దర్శనం, గిరిజనులతో ముఖాముఖి, రెండోసారి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో, మూడోసారి మార్చిలో జరిగిన రామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. అలాగే, గత ఏడాది గోదావరి వరదల సమయాన అశ్వాపురంలో బాధితులను పరామర్శించారు. దీంతో జిల్లాకు ఐదో సారి, భద్రాచలానికి నాలుగో సారి వస్తున్నట్లవుతోంది. కాగా, ఈనెల 11న భద్రాచలానికి గవర్నర్ వస్తారని షెడ్యూల్ విడుదల చేయగా, ఈసారి బుధవారం మాత్రం భద్రాచలం, ఖమ్మం జిల్లాల పర్యటన ఖరారైంది. తొలుత హెలీకాప్టర్‌లో వస్తారని చెప్పినా.. 17న రైలు మార్గంలో గవర్నర్ తమిళిసై రానున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఇలా..

రాజ్‌భవన్ వర్గాలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గవర్నర్ పర్యటన షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశాయి. మంగళవారం రాత్రి సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైలులో బయలుదేరనున్న గవర్నర్ బుధవారం తెల్లవారుజామున 4.15 గంటలకు కొత్తగూడెం చేరుకుని రోడ్డు మార్గంలో సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. ఉదయం 8.30 గంటలకు భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామిని దర్శించుకుని పూజలు చేశాక కూనవరం రోడ్డులో ఉన్న వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో జరిగే గిరిజనులకు ఆరోగ్య అవగాహన సదస్సు, గిరిజనులతో ముఖాముఖితో పాటు రెడ్‌క్రాస్ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 12 గంటలకు ఐటీసీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని భోజనం అనంతరం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు, అక్కడి నుంచి ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మం జిల్లా పొన్నెకల్లులోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రీసెర్చ్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి సమావేశమవుతారు. అనంతరం రోడ్డు మార్గంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లనున్న గవర్నర్ తమిళిసై సాయంత్రం 6 గంటలకు రైలులో సికింద్రాబాద్ బయలుదేరుతారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- మణుగూరులో మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి ప్రాధాన్యత ఇస్తూ.. క్రీడాకారులను ప్రోత్సహించడంలో ముందంజలో నిలుస్తోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుఢ్యానికి దోహదపడతాయని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా క్రీడాకారులకు సదుపాయాలు కల్పిస్తూ వారి నైపుణ్యతను ప్రదర్శించే అవకాశం కల్పించిందని తెలిపారు. ఈనెల 17 వరకు మండల స్థాయిలో జరుగుతున్న క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ కె.నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పోశం నరసింహారావు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సర్పంచ్ బచ్చల భారతి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఏఈఓకు అభినందనల వెల్లువ

అశ్వారావుపేటరూరల్: జిల్లాలోనే అత్యధికంగా అశ్వారావుపేట క్లస్టర్ పరిధిలో పామాయిల్ సాగు లక్ష్యాన్ని సాధించిన ఏఈఓ రాయుడును మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ అనుదీప్ సోమవారం వేర్వేరుగా అభినందించారు. జిల్లాలో 2022–23 సంవత్సరంలో 16,805 ఎకరాల్లో పామాయిల్ సాగుతో జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలించిదని, జిల్లా స్థాయిలో అశ్వారావుపేట క్లస్టర్‌లో 5వేల ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, ఏడీ అఫ్జల్ బేగం, ఉద్యాన శాఖ పర్యవేక్షులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

17న పాలిసెట్

- అమల్లో నిమిషం నిబంధన
- విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్ నాగముని నాయక్ సూచన

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలిసెట్ – 2023 నిర్వహించనున్నట్లు పరీక్షల జిల్లా కో ఆర్డినేటర్, కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బి.నాగముని నాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బ్లాక్ లేదా బ్లూ పెన్నుతో పాటు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కరోనా నిబంధనలు పాటించాలన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో లేనివారు పాస్ ఫొటో అంటించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలని చెప్పారు. జిల్లా విద్యార్థుల కోసం కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలంతో పాటు సత్తుపల్లిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయా పట్టణాల్లోని 16 సెంటర్లలో 3,945 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు.

పరీక్ష కేంద్రాలివే..

కొత్తగూడెంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల (రుద్రంపూర్), సింగరేణి ఉమెన్స్ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, సింగరేణి కాలరీస్ హైస్కూల్, ఎస్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చుంచుపల్లి ఉన్నత పాఠశాల, కేవైకేఆర్‌వై జూనియర్ కళాశాల, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ బ్లాక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ బ్లాక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాయి స్ఫూర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మదర్ థెరిస్సా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు నాగముని నాయక్ వెల్లడించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతుల్లో కొన్ని..

- డిగ్రీ వరకు చదివిన తాను వికలాంగురాలినని, బేకరీ అండ్ స్వీట్ షాప్ ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని పాల్వంచ మండలం కిన్నెరసాని గ్రామానికి చెందిన గుమ్మడి నాగమణి వినతిపత్రం అందించగా, జిల్లా సంక్షేమాధికారికి ఎండార్స్ చేశారు.
- టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామ పంచాయతీకి చెందిన సూనావత్ లాల్యా కొత్తగూడెం ఆంధ్రాబ్యాంకు ద్వారా రావాల్సిన పెన్షన్ డబ్బులు గత 14 నెలలుగా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేయగా పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీఎంను ఆదేశించారు.
- చంద్రుగొండ మండలం నారంవారిగూడెం గ్రామానికి చెందిన ఎల్లబోయిన వీరమ్మ తన భర్త 10 సంవత్సరాల క్రితం మరణించాడని, అతని పేరుతో ఉన్న ఖాళీ స్థలంలో రేకుల షెడ్ వేసుకుని జీవిస్తున్నానని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేయగా డీఆర్‌ఓకు ఎండార్స్ చేశారు.

లబ్ధిదారుల వాటా చెల్లించేలా చర్యలు

రెండో విడత గొర్రెల పంపిణీకి ఎంపిక చేసిన లబ్ధిదారులు తమ వాటాను వారం రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. ఐడీఓసీలో అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలన్నారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడలు నిర్వహించాలన్నారు. ఈనెల 22 నుంచి జిల్లాస్థాయి పోటీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. భద్రాద్రి జిల్లా క్రీడలకు పెట్టింది పేరని, రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని తహసీల్దార్లకు సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రసంగ పాఠం తయారు చేసేందుకు శాఖల వారీగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి నివేదికలు అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

మిషన్ లైఫ్‌పై అవగాహన కల్పించాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో మిషన్ లైఫ్‌పై అవగాహనా సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఐడీఓసీలో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సమాఖ్య కార్యదర్శిగా రమేష్


గడ్డం రమేష్

అశ్వాపురం: జాతీయ ఉద్యోగ, కార్మిక సమాఖ్య కార్య నిర్వహణ కార్యదర్శిగా మణుగూరు భారజల కర్మాగారం సైంటిఫిక్ అసిస్టెంట్స్ అండ్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రమేష్ ఎన్నికయ్యారు. రెండు రోజులపాటు కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరిగిన 27వ ఉద్యోగ, కార్మిక సమాఖ్య జాతీయ సమావేశాలలో గడ్డం రమేష్‌ను సమాఖ్య కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం రమేష్ మాట్లాడుతూ కార్మిక లోకంపై జరుగుతున్న దాడిని తిప్పికొడుతూ హక్కులు, ప్రయోజనాలు కాపాడుకునే ప్రయత్నంలో సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమంలో కార్మికులు భాగస్వామ్యం కావాలని కోరారు. భారజల కర్మాగారం కార్మికులు సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని, భారజల కర్మాగారం కార్మిక సంఘాలు సహకారం అందించాలని పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


పంచనామా నిర్వహిస్తున్న ఆర్ఐ లక్ష్మయ్య

దుమ్ముగూడెం: మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కంగాల మారయ్యకు చెందిన ఇల్లు సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఉదయం 8 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఇంట్లో సామగ్రి, ఆధారు కార్డులు, ధాన్యం, బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ లక్ష్మయ్య సందర్శించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.2.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు తెలిపారు.

ఏపీపీ మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: ఖమ్మం బార్ అసోసియేషన్ సభ్యుడు, కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుమ్మరి రామారావు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈమేరకు కొత్తగూడెం జిల్లా కోర్టు లైబ్రరీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యాన సంతాప సభ నిర్వహించగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ రామారావు సేవలను కొనియాడారు. విద్యార్థి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన న్యాయవాద వృత్తిలో రాణించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్‌తో పాటు న్యాయవాదులు పిట్టల రామారావు, సంతోష్‌లాల్ సాహు, కటకం పుల్లయ్య, లక్కినేని సత్యనారాయణ, గాజుల రాంమూర్తి, గడిదాసి కాంతయ్య, సింగ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

సుజాతనగర్: మంటలు అంటుకుని మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వేపలగడ్డ గ్రామ పరిధిలో చింతలపూడి రోశిరెడ్డి అనే రైతు 3 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. పంట చేనుపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు సమీపంలోని చెట్టును తాకడంతో నిప్పు రవ్వలు రాలి మంటలు అంటుకున్నాయి. దీంతో పంట మొత్తం దగ్ధమైంది. ఆర్ఐ కాంతారావు, వ్యవసాయాధికారిణి నర్మద పంటను పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యంతో పోలీసులు

కొత్తగూడెంరూరల్: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం గ్రామంలోని ఓ ఇంట్లో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేయగా, పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పాల్వంచ: పాల్వంచ పట్టణానికి చెందిన ఓ బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మైనర్ బాలికపై బాలుడు లైంగిక దాడికి పాల్పడినట్లు చుట్టు పక్కన ప్రజలు గుర్తించి సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ నరేష్, అదనపు ఎస్ఐ ప్రవీణ్‌లను వివరణ కోరేందుకు ప్రయత్నించగా... వారు అందుబాటులో లేరు.

ప్రైవేట్ ఆస్పత్రులపై కొరడా

- ఏడు బృందాలుగా వైద్యశాఖ అధికారుల దాడులు
- ఇప్పటికే 8 ఆస్పత్రులు, ల్యాబ్‌లు సీజ్, మరో కొన్నింటికి నోటీసులు
- నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలకు సిద్ధం


భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్య సిబ్బంది

చుంచుపల్లి: జిల్లాలో వైద్యశాఖ అనుమతి పొందకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లపై వైద్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. తనిఖీలు నిర్వహిస్తూ అనుమతుల్లేని ఆస్పత్రులను, ల్యాబ్‌లను గుర్తిస్తున్నారు. 30 మంది అధికారులు 7 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపడుతున్నారు. ఒక్కో బృందంలో ప్రోగ్రాం ఆఫీసర్‌తోపాటు ముగ్గురు వైద్య సిబ్బంది సభ్యులుగా ఉన్నారు. గత శుక్రవారం నుంచి తనిఖీలు జరుగుతుండగా, దస్త్రాలు, అనుమతుల పత్రాలు, రోగుల భద్రత, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి గదులు, ఆస్పత్రి ఆవరణలో ల్యాబ్‌లు, వాస్తవంగా సేవలు అందించే వైద్యులు, రోగులకు అందిస్తున్న మందులు ఇతర వసతులను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని ఆస్పత్రులను సీజ్ చేస్తున్నారు. ఇటీవల భద్రాచలంలో 43 ఆస్పత్రులను తనిఖీ చేసిన అధికారులు 4 ఆస్పత్రులు, 4 ల్యాబ్‌లను సీజ్ చేశారు. నిబంధనలు పాటించని మరో 21 ఆస్పత్రులు, ల్యాబ్‌ల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

అర్హతలేని సిబ్బందితో..

జిల్లా వ్యాప్తంగా 274 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు నడుస్తున్నాయి. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ తదితర ప్రాంతాల్లో వెలిసిన ఆస్పత్రులు రోగులను నిలువు దోపిడీ చేస్తున్నాయి. వైద్యరంగంతో సంబంధం లేకపోయినా కొందరు డబ్బు సంపాదనే లక్ష్యంగా ఇష్టారీతిన ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వైద్యశాఖ సూచించిన నిబంధనలు అమలు చేయకుండా సరైన విద్యార్హతలు లేని వారితోనే చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డయాగ్నస్టిక్ సెంటర్లలో ఎక్కువచోట్ల క్వాలిఫైడ్‌కాని, అనుభవం లేని సిబ్బంది పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో రోగులకు కనీస వసతులు కూడా కల్పించడంలేదు.

గతేడాది సెప్టెంబర్‌లో..

గతేడాది సెప్టెంబర్‌లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించారు. 141 ఆస్పత్రులను తనిఖీ చేసి, 21 ఆస్పత్రులు, ల్యాబ్‌లను సీజ్ చేశారు. మరో 43 ఆస్పత్రులు, ల్యాబ్‌లకు నోటీసులు జారీచేశారు. అయితే అధికారులు వీరి విషయంలో కేవలం జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. దీంతో తాఖీదులు తమనేం చేస్తాయంటూ పలువురు నిర్వాహకులు ఆస్పత్రులు, ల్యాబ్‌లను యథావిధిగా నడిపిస్తున్నారు. ఈ సారైనా తనిఖీల పేరుతో హడావుడికే పరిమితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యశాఖను పలువురు కోరుతున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



అనుమతుల్లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లలో తనిఖీలు చేపట్టాం. ఇందుకోసం ఏడు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే అప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల భద్రాచలంలో కొన్నింటి గుర్తించాం. జిల్లాలో అన్ని చోట్లా వైద్య బృందాలు తనిఖీలు చేపడతాయి.

–డాక్టర్ జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

డెంగ్యూ జ్వరంతో ప్రమాదం

- ఏడీస్ ఈజిప్ట్ దోమలతో వ్యాప్తి
- ఖాళీ స్థలాల్లో నీటి నిల్వతో ముప్పు
- నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం


దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చుంచుపల్లి: డెంగ్యూ జ్వరం వైరస్ వల్లే సంక్రమించే ప్రమాదకరమైన వ్యాధి. దోమలు కుట్టడం ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. ఒక రకమైన ఆర్బో వైరస్ వల్ల సంక్రమించే డెంగీని ఏడీస్ ఈజిప్ట్ అనే దోమ ద్వారా వ్యాపిస్తుంది. అప్రమత్తంగా ఉండకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంటుంది. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కథనం.

వ్యాపించే విధానం

ఎక్కువ శాతం ఈ దోమలు పగలేకుడుతుంటాయి. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందుతాయి. ఎయిర్‌కూలర్స్, రిఫ్రిజిరేటర్లు, పూలకుండీలు, బయట పడేసిన టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, నీరు నిల్వ ఉన్న తొట్లు, కుండీలు, ఖాళీ డ్రమ్ములు, భవనాలపై నిలిచిన వాన నీటిలో పనికిరాని, పగిలిన వస్తువుల్లో దోమలు వృద్ధి చెందుతాయి. పారిశుద్ధ్యలోపం వల్ల డెంగీ వ్యాపిస్తుంది. దోమతెరలు, నివారణ మందులు, ఆయిల్‌బాల్స్ వంటివి వినియోగించి దోమకాటు నుంచి విముక్తి పొందవచ్చు. శరీరమంతా రక్షణ కలిగే విధంగా దుస్తులు ధరించాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలి. పనికిరాని, వాడుకలో లేని వస్తువులను తొలగించాలి. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములు, నీటి తొట్లపై మూతలు పెట్టాలి. గ్రామాల్లో వీధులు, మురుగు కాల్వల్లో చెత్తా చెదారం తొలగించాలి. వర్షాలకు ముందు తర్వాత మురికి కాలువల్లో పూడికతీత చేపట్టి, నీరు పారేటట్లు చూడాలి.

గడిచిన ఐదేళ్లలో జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు
2018	401
2019	694
2020	26
2021	413
2022	351
2023	89
	(ఇప్పటివరకు)

డెంగీ లక్షణాలు, చికిత్స

డెంగీ సోకితే చలితో కూడిన జ్వరం వస్తుంది. శరీర ఉష్ణోగ్రత 104,105 ఫారెన్‌హీట్ వరకు ఉండవచ్చు. కీళ్ల, ఒళ్లు నొప్పులు అధికంగా ఉంటాయి. శరీరంపై అక్కడక్కడా దద్దుర్లు వస్తాయి. తీవ్రత పెరిగితే చిగుర్ల నుంచి రక్తం రావొచ్చు. కళ్లలోనూ రక్త చారలు కనిపిస్తాయి. రక్తపోటు తగ్గి మలం నల్లగా కూడా వస్తుంది. ఈ వ్యాధికి సొంత చికిత్స చేయకూడదు. ఆస్ప్రిన్, బ్రూఫెన్, కాంబ్లీఫాం, అనాలజిన్ లాంటి మాత్రలు అసలు తీసుకోకూడదు. వ్యాధి లక్షణాలుంటే అశ్రద్ధ చేయకుండా డాక్టరు సంప్రదించాలి. జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగీపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన చర్యలు చేపడుతోంది. జిల్లాలో గడిచిన రెండేళ్లలో కంటే ఈ ఏడాది డెంగీ కేసులు కొంతమేర తగ్గుముఖం పట్టాయి.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి


సివిల్ జీఎం సూర్యనారాయణను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

మణుగూరుటౌన్: నూతనంగా నిర్మిస్తున్న సైట్ ఆఫీస్ భవనాలను, బేస్ వర్క్‌షాపు భవనాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా నిర్మించాలని సివిల్ విభాగం జీఎం టి.సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన సింగరేణి మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీ, పీకేఓసీ–2 ఎక్స్‌టెన్షన్ ఏరి యాల్లో పర్యటించి, భవన నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సివిల్ డిపార్టుమెంట్ స్టాఫ్, సివిల్ కాంట్రాక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. సివిల్ జీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా మణుగూరు వచ్చిన ఆయన్ను స్థానిక అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఇతర అధికారులు లలిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఎం.నర్సిరెడ్డి, ఎస్.రమేష్, వెంకట్రావు, శ్రీనివాసమూర్తి, వెంగళరావు, అనురాధ, నాగేశ్వరరావు, కిశోర్‌కుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి క్రీడాకారుడికి బంగారు పతకం


రామ్మోహన్‌రావుకు బంగారు పతకం అందజేస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: చెన్నైలో జరుగుతున్న జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలానికి చెందిన గాలి రామ్మోహన్‌రావు బెంచ్ ప్రెస్ ఫైనల్స్‌లో 230 కేజీల బరువు ఎత్తి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావును జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి, తంతరపల్లి వసంతరావు, వీరారెడ్డి, తిరుమలరావు, మల్లేష్ తదితరులు అభినందించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

ములకలపల్లి: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలో సోమవారం వీఓఏలు నిర్వహించిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఓఏలు 28 రోజులుగా సమ్మె చేపడుతున్నా పాలకపక్షం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆందోళనకు ఎంపీటీసీలు శనగపాటి మెహరమణి, తాటి తులసి టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, కాంగ్రెస్ నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, ఖాదర్‌బాబు, అంజుం, బూరుగుపల్లి పద్మశ్రీ , సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మల మధు, బీఎస్‌పీ నియోజకవర్గ నాయకులు గద్దల రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గంటా శ్రీను, జనసేన నాయకులు తాటికొండ ప్రవీణ్, రాంబాబు తదితరులు సంఘీభావం ప్రకటించారు. వీఓఏల సంఘ మండల అధ్యక్షురాలు దాసం కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నరాటి ప్రసాద్, వివిధ మండలాల సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

ఇల్లెందు: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన, పట్టణానికి చెందిన ఓ యువకుడిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనను శారీరకంగా వాడుకున్నాడని యువతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

క్రీడా అవకాశాలను మెరుగుపర్చుకోండి

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మం నగర స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, పక్కన ఖమ్మం కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, మేయర్ నీరజ


అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా అవకాశాలను మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నగరస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోఎక్కడాలేని విధంగా సర్దార్ పటేల్ స్టేడియంలో మౌళిక సదుపాయాలు కల్పించగా, కల్లూరు, వైరాలో స్టేడియంలు పూర్తయ్యాయని తెలిపారు. ఈమేరకు మండల స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగాలని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ క్రీడాపోటీల్లో నగరవాసులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మేయర్ పునుకోల్లు నీరజ, డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు, క్రీడాసంఘాల బాధ్యులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, క్రిస్టోఫర్‌బాబు, కె.ఆదర్శ్‌కుమార్, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ: దాడి ఘటనలో నలుగురిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పొందు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బైక్‌పై పాల్వంచ నుంచి దంతలబోరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగారం గ్రామంలో ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చిన నలుగురు యువకులతో గొడవ జరిగింది. దీంతో వెంకటేశ్వర్లు సోదరుడు హనుమంతరావు వచ్చి ప్రశ్నించగా అతనిపై యువకులు దాడి చేశారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు దాడి చేసిన సాయిపృథ్వీ, సాయిమణికంఠ, కటారపు సందీప్, మెట్ట సందీప్‌లపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య


శ్రీకాంత్(ఫైల్)

కొత్తగూడెంటౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. దుర్గన్ బస్తీకి చెందిన కోరి కిషన్ కుమారుడు కోరి శ్రీకాంత్ (32) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఐదు నెలల క్రితం భార్య అతన్ని విడిచి వెళ్లిపోయింది. కాగా సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి ప్రభుత్వ ఉపాధ్యాయుడు..

చుంచుపల్లి: చుంచుపల్లి హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు నిర్మాణంలో ఉన్న తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న లూనావత్ హనుమ(36) ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆదివారం జూలూరుపాడు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం అతని బావమరిది నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లి చూడగా హనుమ మృతి చెంది ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉండటాన్ని గమనించి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని..

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నారంవారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన ధారవత్ శ్రీను (33) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవ పడేవాడు. సోమవారం కూలి పనులకు వెళ్లిన భార్య తిరిగి వచ్చేసరికి శ్రీను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో వచ్చిన పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి తల్లి వరాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు శ్రీనుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సబ్ స్టేషన్లలో ఎల్‌వీ బ్రేకర్ల ట్రిప్


పాల్వంచలోని సీతారాంపట్నం సబ్‌స్టేషన్

పాల్వంచ: నార్త్ గ్రిడ్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్లలో ఎల్‌వీ బ్రేకర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లింది. పాల్వంచ సీతారాం పట్నం, ఖమ్మం, కొత్తగూడెం, మణుగూరు తదితర సబ్ స్టేషన్లలో ఉదయం 11.52 నిమిషాలకు ఎల్‌వీ బ్రేకర్లు ట్రిప్ అయ్యాయి. దీంతో మరమ్మతులు చేసి అర్ధగంటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు పాల్వంచ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా పాల్వంచ సబ్ స్టేషన్‌లో సమస్య తలెత్తడంతో కొత్తగూడెం, పాల్వంచ, ములకపల్లి, బూర్గంపాడు, అంకంపాలెం తదితర చుట్టుపక్కల మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఉరి వేసుకుని హార్వెస్టర్ యజమాని బలవన్మరణం

స్వగ్రామంలో మృతదేహంతో ఆందోళన


ఉపేందర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి/కూసుమంచి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ హార్వెస్టర్ యజ మాని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం నర్సింహులగూడెంకు చెందిన హార్వెస్టర్ యజమాని, ఆపరేటర్ శీలం ఉపేందర్(33) వరికోతలు కోయడానికి పదిహేను రోజుల క్రితం ఇంకో డ్రైవర్ షేక్ మస్తాన్‌ను తీసుకొని భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి వెళ్లాడు. అక్కడ గది అద్దెకు తీసుకొని ఉంటుండగా, ఆదివారం ఉదయం ఓ రైతు వరిచేను కోయడానికి వెళ్లారు. మధ్యాహ్నం ఉపేందర్‌కు ఫోన్ రావడంతో గదికి వెళ్లి భోజనం చేసి, వచ్చేటప్పుడు డ్రైవర్‌కు తీసుకొస్తానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటలైనా రాకపోయే సరికి మస్తాన్ రూమ్ వద్దకు వెళ్లగా లోపలినుంచి గడియపెట్టుకొని ఉండటంతో కిటికీలో నుంచి చూడగా ఉపేందర్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా చేరుకుని వివరాలు ఆరా తీశారు. కాగా, పోస్టుమార్టం అనంతరం ఉపేందర్ మృతదేహాన్ని సోమవారం నర్సింహులగూడెం తీసుకురాగా ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన మేనమామ దాసరి వెంకన్న తన తల్లికి భూమి విషయంలో వేధిస్తున్నాడని, ఇద్దరి నడుమ కొద్దిరోజుల క్రితం ఫోన్‌లో ఘర్షణ కూడా జరిగిందని కుటుంబీకులు ఆరోపించారు. దీంతో మనస్థాపానికి గురైన ఉపేందర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెబుతూ మృతదేహాన్ని మేనమామ ఇంటి వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్సైలు రమేష్‌కుమార్, శ్రీనివాస్ చేరుకుని బందోబస్తు నిర్వహించారు. పోలీసులు, గ్రామపెద్దలు జోక్యం చేసుకుని మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళన విరమించారు. కాగా, ఉపేందర్‌కు భార్య రేణుక, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

సాక్షి, అమరావతి: అమరావతి ముసుగులో నారా చంద్రబాబునాయుడు సాగించిన భూదందాలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంశం ఓ అవినీతి అధ్యాయమేనని వెల్లడైంది. అలైన్‌మెంట్ ప్రతి మెలికలోనూ పచ్చ గ్యాంగ్ అవినీతి గుట్టు రట్టవుతోంది. టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న చంద్రబాబు, వైస్ చైర్మన్ పొంగూరు నారాయణ అవినీతి బాగోతాలు విస్తుపోయే రీతిలో ఉన్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన లింగమనేని రమేష్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి వెంటనే రూ.877.50 కోట్లకు... రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం ఎల్లో గ్యాంగ్ బరి తెగింపు వ్యవహారాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా పిడికెడు వాటా ఇవ్వడం కొసమెరుపు. అవినీతికి బాటలు వేసిన ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెనుక సాగిన గూడుపుఠాణీ దశలవారీగా ఇదిగో ఇలా సాగింది..!

■ అలైన్‌మెంట్‌ను ఆనుకుని భూములు

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఆ భూములకు 3 కి.మీ. దూరంగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాలి. అలైన్‌మెంట్ మార్పుతో ఆ భూములను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకునే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 9 ఎకరాలు ఒకచోట, ఒప్పందం చేసుకున్న నాలుగు ఎకరాలు మరో చోట ఉండటం గమనార్హం.

■ అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.

■ అక్కడే పవన్ కల్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

■ కృష్ణా ఇవతలా అవినీతి మెలికలే

అమరావతి పరిధిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ద్వారా చంద్రబాబు, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతం పెంచుకోగా కృష్ణానదికి ఇవతల విజయవాడ శివారులో నారాయణ తమ ఆస్తుల విలువ భారీగా పెంచుకున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అయితే అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ నాడు సీఆర్‌డీఏ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు. దాంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం - కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తన విద్యా సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా నారాయణ చక్రం తిప్పారు.

■ అటూ ఇటూ భారీగా కొనుగోలు

ఇన్నర్‌రింగ్ రోడ్డును ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన బాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేశ్ తన సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. అవన్నీ ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అటూ ఇటూ ఉండటం గమనార్హం. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు
వయొలెట్ కలర్: సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

అలైన్‌మెంట్ 1
సీఆర్‌డీఏ తొలుత రూపొందించింది

అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ నిర్ణయించేందుకు టెండర్ల ద్వారా కన్సల్టెన్సీతో నిమిత్తం లేకుండా పని ముగించాలని చంద్రబాబు, నారాయణ నిర్ణయించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు 94 కి.మీ. పొడవుతో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీన్ని చూసి చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఎందుకంటే దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెంచుకునేందుకు ఆ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు.




రెడ్ కలర్ : గుంటూరు, కృష్ణాజిల్లాలను కలుపుతూ కృష్ణానది మీదుగా సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్
గ్రీన్ కలర్ : నారాయణ ఆదేశాలతో కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులు

అలైన్‌మెంట్ 2
చంద్రబాబు ఆదేశాలతో రూపొందించారు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజా ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని మరీ ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. మేర అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అలైన్‌మెంట్ 3
కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించింది

సింగపూర్‌కు చెందిన సుర్బాన జ్యూరాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. అనంతరం ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు ఎస్టీయూపీ అనే ఓ కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే అది ఉండాలని నిర్దేశించారు. అప్పటికే సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. తాడికొండ, కంతేరు, కాజాలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.



అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వయొలెట్ కలర్ : సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్. (మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి)

జిల్లా వార్తలు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: భద్రాదికొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, మహిళా సాధికార కేంద్రంలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఖమ్మం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.అజయ్‌కుమార్ తెలిపారు. పురుషులకు వెల్డింగ్, ఫిట్టర్, ద్విచక్ర వాహనాల సర్వీసింగ్, ఏసీ మెకానిజం, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, రెడీమేడ్ దుస్తులు, జ్యూట్ బ్యాగులు, శానిటరీ నాప్కిన్లు, తాటాకులతో కళాకృతుల తయారీపైనే కాక డీటీపీ, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుండి 25ఏళ్ల లోపు వారు అర్హులని, శిక్షణ కాలంలో ఉపకార వేతనం కూడా అందుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 80969 99384, 73869 82866 నంబర్లలో సంప్రదించాలని జీఎం సూచించారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో మూడు, ఐదు, ఎనిమిదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా గిరిజన విద్యార్థులకు సీట్లు కేటాయించనుండగా, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఓ ప్రకటనలో సూచించారు. మూడో తరగతిలో 57, ఐదో తరగతిలో 29, 8వ తరగతిలో 29 సీట్ల చొప్పున మొత్తం 115 సీట్లు ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారైతే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1,50లక్షలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.2లక్షలు దాటని వారు అర్హులని, కులం, ఆదాయం, నివాసం, జనన ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్‌తో వచ్చే నెల 2వ తేదీలోగా ఐటీడీఏలోని గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వచ్చేనెల 7న నిర్వహించే లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి అదేనెల 15న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పీఓ తెలిపారు.

ఖమ్మం జిల్లాలో 90సీట్లు

ఖమ్మంమయూరిసెంటర్: బెస్ట్ అవైలబుల్ పథకం(బీఏఎస్) ద్వారా ఖమ్మం జిల్లా గిరిజన విద్యార్థులకు 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలు కల్పించనుండగా ఆసక్తి కలిగిన వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన అభివృద్ధి అధికారి కృష్ణానాయక్ తెలిపారు. జిల్లాలో ఈ పథకం ద్వారా 3వ తరగతిలో 45, 5తరగతిలో 23, 8వ తరగతిలో 22 సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు వచ్చేనెల 2వ తేదీలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే, 7వ తేదీన లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని వెల్లడించారు.

నేటి నుంచి 'దోస్త్' రిజిస్ట్రేషన్లు



ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో దోస్త్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జకీరుల్లా, అధ్యాపకులు

- డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుకు అవకాశం
- మూడు విడతల్లో రిజిస్ట్రేషన్లు, ప్రవేశాలు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే ప్రక్రియ మంగళవారం నుంచి మొదలుకానుంది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) షెడ్యూల్‌ను తాజాగా విడుదల చేసింది. ఇందులో భాగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమవుతుంది. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం తదితర కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రవేశాల ప్రక్రియ మూడు విడతల్లో కొనసాగుతుంది. కాగా, ఖమ్మం జిల్లాలో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 30 వరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఖమ్మం నగరంలో ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు సత్తుపల్లి, నేలకొండపల్లి, మధిరలలోని డిగ్రీ కళాశాలలున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 3,240 సీట్లు ఉండగా.. వెబ్ ఆప్షన్ల సమయానికి సీట్లు పెరుగుతాయా .. తగ్గుతాయా అనే అంశంపై స్పష్టత రానున్నది.

దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇలా...

- తొలి విడత రిజిస్ట్రేషన్ ఈనెల 16 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అభ్యర్థులు రూ.200 రుసుంతో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 20నుంచి వచ్చే నెల(జూన్) 11 తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, వచ్చే నెల 16వ తేదీన మొదటి విడత డిగ్రీ సీట్ల కేటాయింపు ఉంటుంది. సీట్లు వచ్చిన వారు 16నుంచి 25వ తేదీ వరకు కళాశాల ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- రెండో విడత ప్రక్రియ రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఉంటుంది. వచ్చే నెల(జూన్) 16నుంచి 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు ఉండగా, 16నుంచి 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. అదే నెల 30న సీట్ల కేటాయింపు జరగనున్నది. జూలై 1నుంచి 5వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- మూడో విడత ప్రక్రియ జూలై 1నుంచి 5వ తేదీ వరకు జరగనుండగా రూ.400రూపాయల ఫీజు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జూలై 1నుంచి 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 10న సీట్ల కేటాయింపు జరుగుతుంది. 10నుంచి 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. కాగా, మూడు విడతల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులంతా జూలై 10నుంచి 15వ తేదీ వరకు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూలై 11న నుంచి 15వ తేదీ వరకు కళాశాలల్లో ఒరియెంటేషన్ కార్యక్రమాలు, అదే నెల 17నుంచి తరగతులు ప్రారంభిస్తారు.


ఏమేం కావాలంటే...

రిజిస్ట్రేషన్ సమయాన విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరం హాల్‌టికెట్ నంబర్ అందుబాటులో ఉంచుకోవాలి. అలాగే, ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్, ఇంటర్ టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఈసారి యాప్ కూడా..

ఉన్నత విద్యాశాఖ ఈ ఏడాది నుంచి దోస్త్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో మీ సేవ సెంటర్లు, కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్లు, టీ పోలియో యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు. ఈసారి యాప్ అందుబాటులోకి తీసుకురావడంతో రిజిస్ట్రేషన్ మరింత సులభం కానుంది.

ఓటీపీలు, పిన్ నంబర్లు ఇతరులకు చెప్పొద్దు...



రిజిస్ట్రేషన్‌ను మరింత సులభం చేసేందుకు దోస్త్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకునే సమయాన తమది లేదంటే తల్లిదండ్రుల ఫోన్ నంబర్ మాత్రమే ఉపయోగించాలి. ఆ నంబర్‌కు వచ్చే ఓటీపీలు, పిన్ నంబర్లు ఇతరులతో పంచుకోవద్దు. రిజిస్ట్రేషన్‌కు ఇచ్చే నంబర్ అడ్మిషన్ ప్రక్రియ ముగిసే వరకు తప్పకుండా ఉండాలి. విద్యార్థులకు సందేహాలు ఉంటే 96663 01229 నంబర్ లేదా ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలి.

– సుబ్రహ్మణ్యం, దోస్త్ కో ఆర్డినేటర్, ఖమ్మం

రామాలయానికి ట్రాలీ ఆటో బహూకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి పట్టణంలోని భద్రాద్రి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ యజమానులు సోమవారం ట్రాలీ ఆటో వితరణగా అందచేశారు. సీఆర్వో క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏజెన్సీ ప్రతినిధులు ఆలయ ఈఓ రమాదేవికి ఆటో తాళాలను అప్పగించారు. దేవస్థానం పరిధిలో జరిగే కార్యక్రమాలతో పాటుగా ఇతర పనులకు ఆటో ట్రాలీ ఉపయోగపడుతుందని పేర్కొన్న ఈఓ.. ఏజెన్సీ యజమాని దమ్మాలపాటి జానకీరాంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవానీరామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, ఏజెన్సీ సిబ్బంది వెంకన్న బాబు, అన్వర్‌బాషా, వీరబాబు పాల్గొన్నారు.



ఈఓకు ఆటో తాళాలు అప్పగిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు

ఏఐబీఈఏ సదస్సులో ఉమ్మడి జిల్లా ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ముంబైలో జరిగిన ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐబీఈఏ) జాతీయ సదస్సులో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగుల సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు. శనివారం మొదలైన ఈ సదస్సు సోమవారం ముగిసింది. ఉమ్మడి జిల్లా ప్రతినిధులు నాగేందర్(కేంద్ర సహకార బ్యాంక్), రాజేష్(యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), శ్రీకాంత్(బ్యాంక్ ఆఫ్ బరోడా) పాల్గొనగా, బ్యాంకు ఉద్యోగుల సమస్యలు, ప్రైవేటీకరణపై చర్చించినట్లు తెలిపారు.

రెండో వారధికి రూపం..



మొదటి బ్రిడ్జికి సమాంతరంగా గ్రెడ్డర్లతో పిల్లర్లు కలిసిన రెండో బ్రిడ్జి

పిల్లర్లకు గ్రెడ్డర్ల అనుసంధానం ప్రక్రియ పూర్తి

భద్రాచలం: తొమ్మిదేళ్లుగా ఆగుతూ.. సాగుతూ నత్తనడక పనులు జరుగుతున్న భద్రాచలం గోదావరిపై రెండో వంతెన ఓ ఆకారానికి వచ్చింది. భద్రాచలం, సారపాక రెండు వైపులా 33 పిల్లర్లను గతంలోనే నిర్మించగా, వాటిని గ్రెడ్డర్లతో అనుసంధానం చేసే ప్రక్రియ సోమవారం పూర్తయింది. ఆ పిల్లర్లను కలుపుతూ ఏర్పాటు చేసిన గ్రెడ్డర్లు ఒక్కటయ్యాయి. దీంతో మొదటి బ్రిడ్జికి సమాంతరంగా రెండో బ్రిడ్జి కనిపిస్తోంది. అయితే ఈ వారధి 12 అడుగుల వెడల్పు ఉండగా ఇరువైపులా నాలుగు అడుగుల ఫుట్‌పాత్ నిర్మాణం, బ్రిడ్జికి రక్షణ గోడతో పాటు , సారపాక, భద్రాచలం రెండు వైపులా అప్రోచ్ రోడ్డు, సీసీ రోడ్డుతో పాటు ఇతర నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇరువైపులా పిల్లర్లు కలిసిన నేపథ్యంలో ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో గోదావరి వరద పెరిగినా బ్రిడ్జి పనులకు ఎలాంటి ఆటంకం కలగదని నేషనల్ హైవే అధికారులు చెబుతున్నారు. అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తామని అంటున్నారు. కాగా 2014 అక్టోబర్‌లో శంకుస్థాపన చేసిన ఈ రెండో బ్రిడ్జి ఈ ఏడాది అక్టోబర్ నాటికైనా సిద్ధమైతే రవాణా ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

తిరోగమనం దిశగా బీజేపీ

- వచ్చే నెల 4న కొత్తగూడెంలో భారీ బహిరంగ సభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ: దేశవ్యాప్తంగా బీజేపీ తిరోగమనం ప్రారంభమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజకీయాలు, మతాన్ని కలిపి లబ్ధి పొందాలని చూసిన బీజేపీకి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్, పాల్వంచలోని సీఆర్ భవనంలో సోమవారం జరిగిన జిల్లాల స్థాయి కౌన్సిల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు దిగజారుడు విధానాలను అవలంబిస్తుందనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. ఆర్థికంగా దేశాన్ని దివాళా తీయించిన బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య విభజన తీసుకువచ్చేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో అమిత్‌షా, మోదీల ఎత్తుగడలు, పారాయణాలు పని చేయలేదని.. రానున్న కాలంలో దేశ వ్యాప్తంగా బీజేపీకి ఇదే పరిస్థితి ఎదురవుతుందని చెప్పారు. కాగా, సీపీఐ ఆధ్వర్యాన బీజేపీ కో హఠావో.. దేశ్‌కో బచావో నినాదంతో గ్రామగ్రామాన చేపట్టిన ప్రజాపోరు యాత్రకు విశేష స్పందన లభించిందని వివరించారు. వచ్చే నెల 4న కొత్తగూడెంలో పార్టీ బలాన్ని చాటిచెప్పేలా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ నాయకులు కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, అజీజ్ పాషా తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు పోటు ప్రసాద్, ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్.కే.జానీమియా, గోవిందరావు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, సలీం, వై.శ్రీనివాసరెడ్డి, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, భాస్కర్‌రావు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, దస్రు, దస్తగిరి, కేశవరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు